## క్లుప్తంగా

### విలసవిల్లిలో ప్రత్యేక పూజలు



విలసవిల్లిలో ద్రాక్ష పళ్లు, దానిమ్మ గింజలతో అలంకరణలో శివలింగాలు

**ఉప్పలగుప్తం:** కార్తిక మాసం సందర్భంగా మండలంలోని విలసవిల్లి గ్రామంలో అర్చకులు ముచ్చింగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలింగార్చనలో భాగంగా 21వ రోజు ఆదివారం మట్టితో 365 శివలింగాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. మట్టితో మృత్తికా శివలింగాలు తయారుచేసి ఆకర్షణీయంగా అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### నేడు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఐ.పోలవరం:** మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శ్రీకారం చుడతారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మురమళ్ల పితానివారిపాలెం, జగనన్న కాలనీల్లో నూతన మంచినీటి ట్యాంక్ పనులకు శంకుస్థాపన, ఐ.పోలవరం సాగిరాజు వారిమెరకలో నూతన వాటర్ ట్యాంక్ పనులకు భూమి పూజ చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### దివ్యాంగులపై ఆదరణ చూపాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా

**ముమ్మిడివరం:** దివ్యాంగులపై ఆదరణ, కరుణ చూపుతూ సమాజంలో వారికి ఉన్నత స్థానం కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా అన్నారు. స్థానిక భవిత దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సామాజిక ఆర్థిక రంగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్వీ ప్రసాద్, న్యాయవాదులు దోనిపాటి ఆంజనేయులు, కాశి సిద్దార్థ కుమార్, దాసరి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఐ.పోలవరం:** బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ కారణంగా తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఈఈ మోకా రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. విద్యుత్ వైర్ల కింద, స్తంభాల వద్ద ఎవరూ ఉండొద్దని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగితే దగ్గరలో ఉన్న లైన్‌మన్‌కు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఐ.పోలవరం సబ్‌స్టేషన్ 9440904494, మురమళ్ల సబ్‌స్టేషన్ 9493178762 నంబర్లుకు ఫోన్ చేయొచ్చన్నారు.

### నమస్తే పథకానికి నోడల్ ఆఫీసర్ నియామకం

**యానాం:** పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే(నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్)ప్రాజెక్టుకు నోడల్ అధికారిగా ఇలంగోవన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. పారిశుద్ధ్య పనులు చేసేవారికి రక్షణ కల్పించడం, వారి గౌరవాన్ని కాపాడటం కోసం ఈ నమస్తే ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అభివృద్ధి చేశాయని అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛదా ఉదయామి స్కీం లబ్ధిదారుల గుర్తింపు, రుణాల మంజూరు, శిక్షణ తదితరమైనవి నమస్తే ప్రాజెక్టులో ముఖ్యమైన లక్ష్యాలన్నారు.

### అమలాపురంలో కాంగ్రెస్ విజయోత్సవం

**అమలాపురం టౌన్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విజయోత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. వేడుకల్లో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరంలో..**

**ముమ్మిడివరం:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆదివారం స్థానిక బుద్ధ పార్కులో పార్టీ నాయకులు సమావేశమై హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంచి పెట్టుకున్నారు. పెన్మత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, గోడి భాస్కరరావు, ముషిణి శివప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వడ్డీల కార్తిక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ



అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్వికేను సత్కరిస్తున్న కాపు ఉద్యోగ సేవా సమితి ప్రతినిధులు



చేయి చేయి కలిపి ఐక్యతను చాటుతున్న కోనసీమ శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు



తాళ్లరేవులో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



కార్తిక వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

# కార్తిక వన సమారాధనల సందడి

**వడ్డీల కార్తిక వన సమారాధన**

**అమలాపురం టౌన్:** స్థానిక వడ్డిగూడెం రామాలయం వద్ద వడ్డీల కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, కైకలూరు నియోజకవర్గం నుంచి వచ్చిన ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వడ్డీలు ఐక్యతతో ఉండాలని, ప్రభుత్వం వడ్డీల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ జయ మంగళ అన్నారు. తొలుత వీరు ఉసిరి చెట్టు వద్ద కార్తిక పూజలు గావించారు. అనంతరం సంఘీయులంతా కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు. అమలాపురం వడ్డీల సంఘం గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, సంఘ అధ్యక్షుడు నగభేరి వెంకటరమణమూర్తి, కార్యదర్శి బొర్రా మాసరి తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురంలో..**

స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్‌లో కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శెట్టిబలిజ సామాజిక వర్గ పెద్దలు మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి, వాసంశెట్టి తాతాజీ, సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాసరావు, దంగేటి



మాలల కార్తిక వన సమారాధనలో మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ తదితరులు

కొండబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి తదితరులు వన సమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అందరూ కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు. కోనసీమ శెట్టిబలిజ సంఘాల నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, పితాని బాలకృష్ణ, పెచ్చెట్టి విజయలక్ష్మి, దొమ్మేటి రాధాకృష్ణ, చిట్టూరి పెదబాబు, బొంతు గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

**కాపు వర్గీయుల వనభోజనాలు..**

**అమలాపురం టౌన్:** జిల్లా కాపు ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ శివారులో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. జిల్లా సమితి అధ్యక్షుడు నల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కాపు ఉద్యోగుల సదస్సుకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అతిథులుగా పాల్గొన్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్‌ను జిల్లా కాపు ఉద్యోగుల తరపున సత్కరించారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దంగుడు బియ్యం శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పోతంశెట్టి దొరబాబు, వేమన సత్యనారాయణ, అయినవిల్లి ఎంపీడీవో తాడి వెంకటాచారి, బసవా వేణుగోపాల్, నంద్యాల నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**బోడసకుర్రులో..**

**అల్లవరం:** మండలంలోని బోడసకుర్రులో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాలల ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఐక్యమత్యంతోనే హక్కులు సాధించుకోవచ్చున్నారు. అనంతరం సంఘీయులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అనంతరం మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, టీడీపీ నాయకుడు హరీష్‌మాధూర్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, సంఘ అధ్యక్షుడు మోసుగంటి దుర్గారావు, కార్యదర్శి అంబటి లక్ష్మణరావు, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, జల్లి వెంకటేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, అంబటి శ్రీను, నాగవరపు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లరేవులో..**

**తాళ్లరేవు:** స్థానిక బైపాస్ రహదారిలోని గుండాబత్తుల శివరామ్ స్థలంలో తెలగా అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తిక వనసమారాధనను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత మహిళలు ఉసిరిచెట్టు వద్ద కార్తిక దామోదరునికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు రోళ్ల చక్రవర్తి, పోతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

**యానాం:** తెలగా కాపు అభ్యుదయ సంఘం, శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో విడివిడిగా ఆదివారం కార్తిక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కుల సంఘాల నాయకులు, మహిళలు హాజరయ్యారు.

**బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో..**

**అమలాపురం రూరల్:** స్థానిక ఎత్తు రోడ్డులో సత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. అనంతరం సంఘీయులంతా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు గుత్తుల వీరబ్రహ్మం, దుగ్గిరాల దుర్గాప్రసాద్, గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, యనమదాల బుజ్జి, న్యాయవాది కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి

**ఉప్పలగుప్తం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి సచివాలయంలో ఆమె అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాయన్నారు. అనంతరం ఆయుష్మాన్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. భీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు కె.విష్ణుప్రియ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్



విలసవిల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

గౌరీకుమారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సల ఏసు, గుండుమోగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తుపానును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

**యానాం:** మిచాంగ్ తుపానును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పుదుచ్చేరి నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి వైఎల్ఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వివిధ శాఖల అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో కలిసి తీరప్రాంత గ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, పరంపేట, అయ్యన్ననగర్, కురసాంపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను, బాధితులకు ఆహారం తయారుచేసేందుకు నిర్దేశించిన అన్నపూర్ణాలయాన్ని ఆయన పరిశీలించారు. బియ్యం బస్తాలను లెక్కించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించి పీడబ్ల్యూడీ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్ఏఓ చాంబర్‌లో విజయవాడ నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో



బాధితులకు భోజనం అందించే అన్నపూర్ణాలయాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వైఎల్ఎస్ రెడ్డి

ఆయన సమావేశమై చర్చించారు. బాధితుల కోసం 33 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ప్రకాశం, ఎస్పీ రఘునాయగం, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలో ఉమా మనోవికాస కేంద్రం

**యానాం పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగుల ప్రత్యేక విద్యకు కృషి**

**యానాం:** దివ్యాంగులను అక్కున చేర్చుకుంటూ 35 ఏళ్లుగా వారి ఎదుగుదలకు కృషి చేస్తుంది యానాంలోని ఉమామనోవికాస కేంద్రం. ఈ కేంద్రం పరిధిలో దివ్యాంగుల కోసం ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి వారి ఆరోగ్యం, విద్య, ఉపాధి, సాంఘిక, సాధికారిత విషయాలను నేర్పిస్తున్నారు. 1988లో కాకినాడలో ప్రారంభమైన ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ(ఉమా మనోవికాస కేంద్రం) తదనంతరం యానాంలో సైతం మరో శాఖను ఏర్పాటు చేసి దివ్యాంగులకు నిర్విరామంగా సేవలందిస్తుంది. ఈ సంస్థ 9 మంది బుద్ధి మాంద్యత గల పిల్లలతో మొదలై ఇప్పటివరకూ వేలాది మందికి ప్రత్యేక విద్య(స్పెషల్ ఎడ్యుకేషన్)ను అందించడమే కాకుండా వారికి జీవనోపాధి అవకాశాలను కల్పిస్తుంది.

యానాంలోని జిక్రియానగర్‌లోని మానసిక దివ్యాంగ పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి గత 12 ఏళ్లుగా బుద్ధి మాంద్యత, సెరిబ్రల్ పాలసీ, వినికిడి ఇబ్బందులను తొలగించడానికి ప్రత్యేక విద్యను అందిస్తుంది. దీంట్లో భాగంగా పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, రోజువారీ పనులు, ప్రాథమిక విద్య, వృత్తినైపుణ్యం, విద్య తదతర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 60 మంది దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. అంతేకాకుండా సివియర్ కండీషన్‌లో ఉండి కదలలేని స్థితిలో ఉన్న 30 మంది దివ్యాంగ పిల్లలకు ప్రతి శనివారం వారి



యానాం దివ్యాంగ పాఠశాలలో విద్యార్థులతో అప్పటి ఎల్జీ కిరణ్ బేడీ(ఫైల్)

ఇంటి వద్దకే వెళ్లి ప్రత్యేక విద్య అందిస్తున్నారు.

**అప్పటి పుదుచ్చేరి ఎల్జీ కిరణ్‌బేడీ సందర్శన**

యానాంలోని ఉమామనోవికాస కేంద్రాన్ని అప్పటి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ సందర్శించి దివ్యాంగులకు అందిస్తున్న సేవలపై ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డిని అభినందించారు. దివ్యాంగ చిన్నారుల కోసం ఆమె పుదుచ్చేరి నుంచి వివిధ ఆట వస్తువులు తెచ్చి వారికి అందజేశారు. వాళ్లతో కలిసి గ్రూపు ఫొటో దిగారు. 35 ఏళ్లుగా దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఉమామనోవికాస కేంద్రానికి ఆరు సార్లు జాతీయపురస్కారాలు లభించాయి. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్, ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిడ్, పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణసామి, ఎల్జీ కిరణ్‌బేడీ తదితరుల నుంచి అనేక అవార్డులను సంస్థ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి అందుకున్నారు. మూడున్నర దశాబ్దాలుగా దివ్యాంగులకు ఆరోగ్యం, ఉపాధి తదితర విషయాల్లో విస్తృత సేవలు అందిస్తున్నామని ఉమా మనోవికాస కేంద్రం డైరెక్టర్ ఎస్పీ రెడ్డి అన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**అల్లవరం:** స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా డీఆర్ఓ సత్తిబాబు డి.రావులపాలెంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. జనవరి 1, 2014 నాటికి 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు నమోదు, డబుల్ ఎంట్రీ ఓట్ల తొలగింపుపై సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఎం.సతీష్, సుబ్బరాజు పాల్గొన్నారు.



డి.రావులపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఓ సత్తిబాబు

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఉప్పలగుప్తం:** బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ తీవ్ర రూపం దాల్చి తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కేశవ వర్ధన్ రెడ్డి సూచించారు. తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరితో కలిసి ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా భీమనపల్లిలోని వరి క్షేత్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం రైతులు కోతలు కోయొద్దని, కోసిన వరి ఉంటే తక్షణమే మెరక ప్రాంతానికి చేర్చాలని సూచించారు. రాశులుగా ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, తీర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. అనంతరం గొల్లవిల్లిలో ఉన్న 213, 214 పోలింగ్ బూత్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, ఆర్ఐ ఎం.వెంకటరమణ, వీఆర్వో ఎస్.బాలాజీ తదితరులున్నారు.



భీమనపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి



ఎస్.రామేశ్వరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్

**అల్లవరం:** మిచాంగ్ తుపాను నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాంబశివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన ఎస్.రామేశ్వరం, ఓడలరేవు పునరావాస కేంద్రాలను పరిశీలించి తాగునీరు, జనరేటర్‌ని అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద రెవెన్యూ సిబ్బంది ఉండి పరిస్థితిని సమీక్షించాలన్నారు. అనకాపల్లి జిల్లా నల్లపల్లి మండలం నుంచి చేపల వేటకు వచ్చి ఎస్.రామేశ్వరం తీర ప్రాంతంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను తహసీల్దార్ సాంబశివప్రసాద్ స్వయంగా కలిసి తుఫాన్ పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. 40 మంది మత్స్యకారులకు తుపాను పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులతో తుఫాన్‌పై సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావం తగ్గే వరకూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్ఐ దుర్గా శ్రీను, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



లూయీ బ్రెయిలీ, హెలిన్ కెల్లరీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వంటెద్దు వెంకన్నాయుడు

**అమలాపురం టౌన్:** స్థానిక వంటెద్దువారి వీధిలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. లూయీ బ్రెయిలీ, హెలిన్ కిల్లరీ చిత్రపటాలకు వెంకన్నాయుడు, దివ్యాంగుల జిల్లా సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు, జల్లి సుజాత తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొంతు శ్రీనివాసరావు, సాధనాల విఘ్నేశ్వరరావు, యల్లమల్లి సుందరరావు, అత్తిలి గణేష్, గొల్లపల్లి బాబి, చీకట్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఘంటసాల శతజయంత్యుత్సవం

**తాళ్లరేవు:** మండలంలోని పి.మల్లవరంలో సోమవారం ఘంటశాల శత జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక డీజీబీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 4 గంటలకు ఘంటశాల గానావధానం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి కళాభిమానులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

**ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్**

**యానాం:** మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందం వచ్చిందన్నారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు వేగంగా ఆహారాన్ని తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేగంగా గాలులు వీస్తాయని, భారీవర్షాలు నమోదవుతాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పునరావాస కేంద్రాలకు హోప్ ఐలాండ్‌వాసులు

**తాళ్లరేవు:** మిచాంగ్ తుపాను నేపథ్యంలో కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్‌ఐలాండ్ దీవిలోని 352 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ ఎస్.పోతురాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుఫాను ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ నేతృత్వంలో సముద్రం మధ్యలో ఉన్న హోప్‌ఐలాండ్ వాసులను కాకినాడ రూరల్ మండలంలోని డ్రైవర్స్ కాలనీలోని పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. వారికి వసతి, తాగునీరు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే దీవిలో మిగిలిఉన్న మరో 24 మందిని కూడా సోమవారం తీసుకురానున్నట్లు తెలిపారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో తేమ శాతం అధికంగా ఉన్నా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు.



పునరావాస కేంద్రంలో తుపాను బాధితులను పరామర్శిస్తున్న కాకినాడ ఆర్డీఓ కిషోర్

### ఈదురు గాలులకు కూలిన పోర్టికో శ్లాబ్

**అల్లవరం:** తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి వీచిన ఈదురు గాలులకు మండలంలోని కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో మల్లాడి రాంబాబుకు చెందిన ఇంటి పోర్టికో శ్లాబ్ విరిగి పడింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని రాంబాబు తెలిపారు.



ఎస్.రామేశ్వరంలో ఈదురు గాలులకు విరిగిన పోర్టికో శ్లాబ్

## ఉత్తమ విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**అమలాపురం రూరల్:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉప్పలగుప్తం ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ ప్రతినిధులు నగదు బహుమతులను ఆదివారం అందజేశారు. అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన నగదు బహుమతుల ప్రదానోత్సవానికి అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు కె.శేషగిరిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది డీబీ లోక్, విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణలు హాజరై మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆరుగురు ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, జ్ఞాపిక, అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బంగార్రాజు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్, ఆర్థిక కార్యదర్శి నూకపెయ్యి గంగాధర్, కొండలరావు, విజయనిర్మల, కె.రామకృష్ణ, సీహెచ్ ప్రశాంత్, చంటి బాబు, బుజ్జిబాబు, బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.